రహదారుణం


జెండాపంజా రోడ్డులో కనకదుర్గమ్మ ఆలయం వద్ద ఏర్పడిన భారీ గొయ్యి

- నగరంలో అధ్వానంగా రోడ్లు
- అడుగడుగునా గోతులు
- రాకపోకలకు అవస్థలు

రాజమహేంద్రవరం సిటీ: జిల్లా కేంద్రమైన రాజమహేంద్రవరంలో రహదారులపై ప్రయాణించడానికి ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. అడుగడుగునా గోతులు ఉండడంతో రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. ప్రముఖ వ్యాపార కేంద్రమైన రాజమహేంద్రవరంలో జనాభా రోజురోజుకూ పెరుగుతోంది. చుట్టుపక్కల జిల్లాల నుంచి వేల సంఖ్యలో ప్రజలు విద్య, ఉద్యోగం, వ్యాపారం, వైద్యం తదితర వాటి కోసం నిత్యం నగరానికి వస్తారు. దీంతో రోడ్లన్నీ ఎప్పుడూ వాహనాలతో రద్దీగా ఉంటాయి. పెద్ద సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తాయి.

రోడ్లు ఛిద్రం

ఇటీవల కురిసిన వర్షాలకు నగరంలోని పలు రోడ్లు ఛిద్రంగా మారాయి. ఎక్కడికక్కడ గోతులు ఏర్పడ్డాయి. వాటిలో నీరు చేరడంతో వాహనచోదకులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. రోడ్లపై ప్రయాణం ప్రమాదంగా మారిందని వాపోతున్నారు. నగరంలోని ప్రధాన రహదారులపై ఏర్పడిన గోతులతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రజలు ఇన్ని ఇబ్బందులు పడుతున్నా నగరపాలక సంస్థ అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

తప్పని ఇబ్బందులు

నగరంలోని కొన్నిచోట్ల రహదారులకు నగర పాలక సంస్థ అధికారులు మరమ్మతులు చేపట్టారు. కానీ పూర్తిస్థాయిలో చేయకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ప్రధాన రహదారుల్లో సైతం గోతులు పూడ్చకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. నగరంలోని దానవాయిపేట, బైపాస్ రోడ్డు, గోరక్షణ పేట, తాడితోట, బైపాస్ రోడ్డు, ఆర్యాపురం, మెయిన్ రోడ్డు తదితర ప్రాంతాల్లో గోతులు ఎక్కువగా ఏర్పడ్డాయి.


బైపాస్ రోడ్డులో ఏర్పడిన గోతులు


దానవాయిపేటలోని బరియల్ గ్రౌండ్ వద్ద..


తాడితోట జంక్షన్‌లో గోతులు

నరకయాతన



నగరంలో రోడ్లపై రాకపోకలు సాగించడానికి నరకయాతన పడుతున్నాం. అధికారులు నిర్లక్ష్యాన్ని వదిలి యుద్ధప్రాతిపదికన గోతులను పూడ్చే పనులు చేపట్టాలి. ఇటీవల కురిసిన వర్షాలకు నగరంలో చాలా రోడ్లు దెబ్బతిన్నాయి. ఆ గోతుల్లో పడి నిత్యం పలువురు ప్రమాదాలకు గురవుతున్నారు.

– సబ్బారపు సూరిబాబు, రాజమహేంద్రవరం

మరమ్మతులు చేపట్టాలి



నగరంలోని రహదారులపై ఏర్పడిన గోతులకు తక్షణమే మరమ్మతులు చేపట్టాలి. వాటిపై రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. వర్షం కురిస్తే అసలు ప్రయాణం చేయలేని పరిస్థితి నెలకొంది. సంబంధిత అధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలి.

– బైరెడ్డి శ్రీనివాసరెడ్డి, రాజమహేంద్రవరం

క్లుప్తంగా

నేడు లక్ష దీపోత్సవం

కడియం: కడియపులంకలోని ఆంజనేయస్వామివారి ఆలయం వద్ద సోమవారం లక్ష దీపోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ పల్ల సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ సందర్భంగా ఆంజనేయస్వామి జన్మ నక్షత్ర పూజ, పార్వతీ పరమేశ్వరుల శాంతి కల్యాణం జరుగుతాయన్నారు. అనంతరం దీపోత్సవం ప్రారంభమవుతుందని వివరించారు. ఈ మేరకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు సుబ్రహ్మణ్యం చెప్పారు.

హైందవ శంఖారావం పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

రాజమహేంద్రవరం సిటీ: విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో విజయవాడలో జనవరి 5న జరగనున్న హైందవ శంఖారావం కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆర్‌ఎస్‌ఎస్ ప్రాంతీయ అధికారి సుధాకర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం క్వారీ మార్కెట్ సెంటర్‌లోని దీన్ దయాళ్ కల్యాణ మండపంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హైందవ శంఖారావం పోస్టర్‌ను ఆవిష్కరించిన అనంతరం నగర బాధ్యతలను ప్రకటించారు. కార్యక్రమంలో విభాగ కన్వీనర్ రిమ్మలపూడి సుబ్బరాజు, ఆర్‌ఎస్‌ఎస్ గోదావరి విభాగ ప్రచారక్ సోమశేఖర్, నగర కన్వీనర్ అనంత, నగర సహ కన్వీనర్ బొమ్ముల రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

శెట్టిబలిజల అభ్యున్నతికి కృషి


సత్తిబాబును అభినందిస్తున్న సంఘీయులు

సీటీఆర్ఐ: శెట్టిబలిజ సామాజిక వర్గీయుల అభ్యున్నతికి కృషి చేస్తానని ఏపీ శెట్టిబలిజ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన కుడుపూడి సత్తిబాబు అన్నారు. జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న ఆయన కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శెట్టిబలిజ కార్పొరేషన్ ద్వారా సంఘీయులకు రాయితీలు వచ్చేలా చేస్తాననన్నారు. ఈ సందర్భంగా గౌడ, శెట్టిబలిజ, శ్రీశైన, ఈడిగ యాత సంఘం గౌరవ అధ్యక్షుడు బుద్దిగ శ్రీనివాసరావు, అధ్యక్షుడు రెడ్డి రాజు, గౌరవ సలహాదారు గెద్దాడ హరిబాబు, కార్యనిర్వాహక కార్యదర్శి సూరంపూడి శ్రీహరి, బుద్దిగ రవి తదితరులు ఆయనకు అభినందనలు తెలిపారు.

కంటి వైద్య శిబిరం

కడియం: దుళ్ల మార్కెట్ సెంటర్‌లో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. మదర్ థెరిస్సా సేవా సమితి ఆధ్వర్యంలో విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ సౌజన్యంతో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. శస్త్ర చికిత్సలు అవసరమైన వారికి సూచనలు చేశారు. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు చొప్పన సత్తిబాబు, చందన సత్తిబాబు, తొట్టి సత్తిబాబు, ఎంపీటీసీ కట్టుంగ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ సిటీ కో ఆర్డినేటర్‌గా విశ్వేశ్వరరెడ్డి



రాజమహేంద్రవరం సిటీ: కాంగ్రెస్ పార్టీ సిటీ కో ఆర్డినేటర్‌గా డాక్టర్ టీకే విశ్వేశ్వరరెడ్డిని నియమిస్తూ పార్టీ అధిష్టానం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం పార్టీ జిల్లా అధ్యక్షుడి వ్యవహరిస్తున్న ఆయనకు ఈ అదనపు బాధ్యతలు అప్పగించింది. ఈ సందర్భంగా టీకే విశ్వేశ్వరరెడ్డికి పలువురు అభినందనలు తెలిపారు.

గోదావరి తాగునీటి పైపులైన్ లీకేజీ


పైపులైన్ లీకేజీ కారణంగా గొయ్యిలో నిండిన నీరు


ఆర్‌అండ్‌బీ రోడ్డుపై ప్రవహిస్తున్న లీకేజీ నీరు

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులో గోదావరి పైపులైను లీకేజీ కారణంగా ఆర్‌అండ్‌బీ రోడ్డు ఛిద్రమవుతోంది. బొమ్మూరులోని కొండపై గల గోదావరి సురక్షిత తాగునీటి పథకం నుంచి రాజవోలు గ్రామానికి వెళ్లేందుకు ఈ పైపులైన్ ఏర్పాటు చేశారు. అయితే బొమ్మూరులోని 220 కేవీ సబ్ స్టేషన్ వద్ద పైపులైన్‌కు లీకేజీ ఏర్పడింది. దీంతో నీరంతా ఆర్‌అండ్‌బీ రోడ్డుపైకి పొంగిపొర్లుతుంది. సంబంధించి అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

బోట్స్‌మెన్ సొసైటీల సభ్యులకు శిక్షణ


సమావేశంలో పాల్గొన్న జేసీ చిన్నరాముడు తదితరులు

సీటీఆర్ఐ: ఇసుక సరఫరా విధానంలో రిజిస్టర్ బోట్స్‌మెన్ సొసైటీ సభ్యులు బాధ్యతగా వ్యవహరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు అన్నారు. ఇసుక లావాదేవీలపై ప్రభుత్వ మార్గదర్శకాలు, చేయాల్సిన, చేయకూడని పనులు తదితర అంశాలపై 90 మంది బోట్స్‌మెన్ సొసైటీ సభ్యులకు ఆదివారం ఆర్డీవో కార్యాలయంలో శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ నిర్మాణ పనులకు అంతరాయం కలగకుండా వినియోగదారులకు ఇసుకను విరివిగా అందించడానికి బోట్స్‌మెన్ సొసైటీలు మరింతగా తవ్వకాలు చేపట్టాలన్నారు. సొసైటీల బ్యాంకు ఖాతాలకు ఇకపై తవ్వకాల చెల్లింపులు నేరుగా జరుపుతారన్నారు. ప్రతి రీచ్ లో కనీసం వెయ్యి నుంచి రెండు వేల మెట్రిక్ టన్నుల ఇసుకను తవ్వాలని సూచించారు. ఇసుక సరఫరా, లావాదేవీల విషయంలో సాంకేతిక అంశాలపై శిక్షణ ఇచ్చేందుకు ఈ రోజు సమావేశం నిర్వహించామన్నారు. రీచ్‌ల వద్ద క్యూలైన్లు, రికార్డుల నిర్వహణ, లోడింగ్, పర్యవేక్షణ తదితర విషయాలలో పారదర్శకంగా వ్యవహరించాలన్నారు. ట్రాక్టర్ల ద్వారా ఓపెన్ రీచ్ పాయింట్ల ఉచిత ఇసుకను అందుబాటులో ఉంచామన్నారు. వీటికి సంబంధించి పభుత్వానికి ఎటువంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. సమావేశంలో జిల్లా మైన్స్ అధికారి డి.ఫణి భూషణ్ రెడ్డి, రాజమహేంద్రవరం ఆర్డీవో ఆర్.కృష్ణ నాయక్, కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత, మైన్స్ అధికారి విష్ణుష్ పాల్గొన్నారు.

వైభవంగా శ్రీనివాస కల్యాణాల మహాయజ్ఞం


కల్యాణంలో పాల్గొన్న చింతా సత్యనారాయణరెడ్డి, శ్రీధర్‌వర్మ

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరు విద్యుత్ ప్రాంగణంలోని సంతాన సీతారామాలయం (బొమ్మూరు భద్రాద్రి)లో శనివారం రాత్రి అమ్మఒడి సేవాతరంగిణి ఆధ్వర్యంలో 108 ఉచిత శ్రీనివాస కల్యాణాల మహాయజ్ఞం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఏపీఈపీడీసీఎల్ విశ్రాంత ఎస్ఈ చింతా సత్యనారాయణరెడ్డి, రూరల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీధర్ వర్మ దంపతులతో పాటు అధిక సంఖ్యలో భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. విశిష్ట అతిథిగా హాజరైన హిందూ చైతన్య వేదిక ప్రాంత సహ సంయోజిక్ వైకే.శ్రీనివాస్ మాట్లాడుతూ 108 ఉచిత శ్రీనివాస కల్యాణముల మహాయజ్ఞం విశిష్టతను వివరించారు.

ముగిసిన సంగీత, నృత్య నీరాజనం


కాళీయ మర్దనం నృత్యాభినయం


గోపికా కృష్ణుల నాట్య విన్యాసం

సీటీఆర్ఐ: గోదావరి తీరంలో రెండు రోజులుగా జరుగుతున్న సంగీత, నృత్య నీరాజనం ఆదివారంతో ముగిసింది. ఉమా నృత్యనికేతన్ ఆధ్వర్యంలో మంజీర పద నృత్యోత్సవం సప్తమ వార్షికోత్సవం సందర్భంగా వెంకటేశ్వర ఆనం కళాకేంద్రంలో ఈ వేడుక జరిగిన విషయం తెలిసిందే. కూచిపూడి నాట్యాచారిణి రెడ్డి ఉమారాణి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఉమా నృత్య నికేతన్‌కు చెందిన లీలా వినీల కూచిపూడి నృత్య పదర్శన అలరించింది. నాట్యాచార్య చక్రవర్తుల పవన్ కుమార్ శిష్యబృందం నృత్యం, అనంతరం ఉమా నృత్యనికేతన్ శిష్యబృందం విశ్వామిత్ర మేనక (శకుంతల జననం) నృత్య రూపకం సంగీత వాయిద్య సహకారంతో ప్రదర్శించారు.

కదిలిన అధికార యంత్రాంగం

సాక్షి ఇంపాక్ట్


వాటర్ ట్యాంకు పంపును పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు

ధవళేశ్వరం: ధవళేశ్వరంలో నెలకొన్న తాగునీటి సమస్యపై ఆదివారం 'సాక్షి'లో ప్రచురితమైన 'గోదావరి తీరంలో దాహార్తి' అనే వార్తకు అధికార యంత్రాంగం స్పందించింది. ఈ మేరకు ఆదివారం ధవళేశ్వరం జనార్దన స్వామి కొండపై ఉన్న రక్షిత మంచినీటి పథకం వాటర్ ట్యాంకును ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పరిశీలించారు. ఆ సమస్యను గ్రామ ప్రత్యేక అధికారి, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ బీవీ గిరికి నివేదించారు. తక్షణమే కోయంబత్తురు నుంచి వాటర్ ట్యాంకు పంపును రప్పించాలని ఆదేశించారు. బీజేపీ రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గ అసెంబ్లీ మాజీ కన్వీనర్ ఒంటెద్దు స్వామి గత మూడు నెలలుగా ప్రజలు పడుతున్న ఇబ్బందులను అధికారులకు వివరించారు. నాలుగు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈలు టి.శ్రీనివాసబాబు, బి.శ్రీనివాస్ హామీ ఇచ్చారు. సమస్యను వెలుగులోకి తీసుకువచ్చిన సాక్షికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

ధవళేశ్వరంలో కార్డన్ సెర్చ్


కార్డన్ సెర్చ్‌లో స్వాధీనం చేసుకున్న వాహనాలు

ధవళేశ్వరం: ధవళేశ్వరం ఐటీసీఎల్ కాలనీలో ఆదివారం పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. డీఎస్పీ భవ్య కిషోర్ ఆధ్వర్యంలో భారీగా పోలీస్ బలగాలు ఈ కార్యక్రమం చేపట్టాయి. ఐటీసీఎల్ కాలనీ బ్లాక్‌లలో ఉంటున్న కొందరు అనుమానితులను ఫింగర్ ప్రింట్ డివైజ్ ద్వారా చెక్ చేసి అదుపులోకి తీసుకున్నారు. సరైన పత్రాలు లేని 18 మోటారు సైకిళ్లను సీజ్ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ నేరాలకు పాల్పడే వారికి ఆశ్రయం కల్పిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అనుమానితులు సంచరిస్తుంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ధవళేశ్వరం సీఐ టి.గణేష్, రాజమహేంద్రవరం టూటౌన్ సీఐ దుర్గారావు, కడియం సీఐ వెంకటేశ్వరరావు, ఎస్సైలు హరిబాబు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ట్రైనీ ఐఏఎస్ అధికారుల పర్యటన


కమిషనర్ కేతన్ గార్గ్‌తో సమావేశమైన ట్రైనీ ఐఏఎస్ అధికారులు

రాజమహేంద్రవరం సిటీ/రాజమహేంద్రవరం రూరల్: ఫీల్డ్ స్టడీ, రీసెర్చ్ ప్రోగ్రామ్‌లో భాగంగా 11 మంది ట్రైనీ ఐఏఎస్ అధికారులు ఆదివారం నగరంలో పర్యటించారు. ముందుగా వారికి నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో జరిగే వివిధ కార్యక్రమాలను కమిషనర్ కేతన్ గార్గ్ వివరించారు. అనంతరం ట్రైనీ అధికారులు కార్పొరేషన్‌లోని వివిధ విభాగాలను సందర్శించి, సిబ్బందితో మాట్లాడి వారి విధుల గురించి తెలుసుకున్నారు. తదుపరి బోర్డు రూములో అన్ని విభాగాల అధిపతులతో సమావేశమయ్యారు. పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా నగరపాలక సంస్థ నిర్వహించే కార్యక్రమాలను సంబంధిత అధికారులు వివరించారు. ఆ తర్వాత సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, లిక్విడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ కేంద్రాలను సందర్శించారు. అక్కడి నంచి ఇన్నీసుపేటలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు.

తెలుగు సాహిత్యానికి దొర బ్రౌన్

సీటీఆర్ఐ: తెలుగు సాహిత్యానికి బ్రౌన్.. దొర వంటి వాడని సాహితీ విమర్శకులు వీవీ సుబ్రహ్మణ్యం అన్నారు. కళాగౌతమి, తెలుగు సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో కందుకూరి వీరేశలింగం నాటక సమాజం ప్రాంగణంలో రచయితల సమావేశం జరిగింది. ప్రతి నెలా రెండో ఆదివారం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. సభకు అధ్యక్షత వహించిన కళాగౌతమి యువ అధ్యక్షుడు చెర్ల సీతారామనాయుడు మాట్లాడుతూ తెలుగు విశిష్టత, సాహిత్యం గొప్పతనాన్ని ప్రపంచానికి చాటిన వారిలో బ్రౌన్ మొదటి వరుసలో ఉంటారన్నారు. కళాగౌతమి అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ పీవీబీ సంజీవరావు, డాక్టర్ బీహెచ్‌వీ రమాదేవి కవులు కవితలకు ప్రశంసలు అందించారు.

బీరు బాటిల్‌తో దాడి

రాజమహేంద్రవరం రూరల్: బీరు బాటిల్‌తో దాడి చేసిన ఘటనపై వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం కేసు నమోదైంది. వివరాల్లోకి వెళితే.. తాడితోటకు చెందిన అంజూరి విజయ కుమార్ టీవీఎస్ షోరూమ్ వెనుక ప్రాంతంలో మద్యం తాగుతున్నాడు. అక్కడే మరి కొందరు అదే పనిలో ఉన్నారు. ఈ నేపథ్యంలో వారిలోని ఒకరితో విజయ కుమార్‌కు మాటామాటా పెరిగింది. దీంతో అతడు బీరు బాటిల్ తో విజయ కుమార్‌పై దాడి చేసి గాయపరిచాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్సై కేశవరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సారా తరలిస్తున్న ఇద్దరికి రిమాండ్

సీతానగరం: బొబ్బిల్లంకకు చెందిన దేవరకొండ శ్రీనివాస్, యరసాని వెంకన్నలకు కోర్టు రిమాండ్ విధించిందని ఎస్సై డి.రామ్ కుమార్ ఆదివారం తెలిపారు. మోటారు సైకిల్‌పై సారా రవాణా చేస్తున్న వీరిద్దరినీ బొబ్బిల్లంక శివారున అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి నుంచి 30 లీటర్ల సారా, మోటారు సైకిల్ స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చగా, రిమాండ్ విధించారన్నారు.

ఇంటర్ విద్యార్థిని అదృశ్యం

రాజమహేంద్రవరం రూరల్: ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న 16 ఏళ్ల తన కుమార్తె కనిపించడం లేదని రాజేంద్రనగర్‌కు చెందిన జి.ప్రసాద్ ఆదివారం వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ బాలిక ఆదివారం ఉదయం ఇంటి నుంచి వెళ్లిపోయింది. అప్పటి నుంచి ఇంటికి తిరిగి రాలేదు. ఈ మేరకు ఏఎస్సై నాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సినిమాలు



శ్యామల	: బ్లడీబెగ్గర్
సూర్యమినీ	: రహస్యం ఇదం జగత్
సూర్యప్యాలెస్	: ధూమ్‌ధామ్
శివజ్యోతి	: క
అనుశ్రీ	: క
స్వామి	: అమరన్
అశోక	: లక్కీ భాస్కర్
రాజా	: అమరన్
రంభ	: బఘీర, భూల్‌భులయ్యా-3
ఊర్వశి	: అమరన్
మేనక	: జితేందర్‌రెడ్డి
కుమారి	: దేవర
అప్సర	: అప్పుడో ఇప్పుడో ఎప్పుడో
నామవరం	
వీఎస్ మహల్	: అప్పుడో ఇప్పుడో ఎప్పుడో, క
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	: అమరన్
కడియం	
వెంకటసూర్య	: క

జోరుగా.. హుషారుగా..

- ఉత్సాహంగా వనసమారాధనలు
- తరలివచ్చిన సంఘీయులు

రాజమహేంద్రవరం రూరల్: తూర్పుకాపుల సంక్షేమానికి కృషి చేస్తానని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. శాటిలైట్‌సిటీలోని జీవీఎస్ అప్పలరాజుతోటలో తూర్పుకాపు సంక్షేమసంఘం ఆధ్వర్యంలో ఆదివారం మొదటి కార్తిక వనసమారాధన నిర్వహించారు. ఆల్ ఇండియా తూర్పుకాపు సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు పిసిని చంద్రమోహన్ నాయుడు, రాష్ట్ర అధ్యక్షుడు ఆకుల అప్పలసూరి నాయుడు, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, డీసీసీబీ మాజీ చైర్మన్ ఆకుల వీర్రాజు, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులు సోము వీర్రాజు, టీడీపీ రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి మజ్జి పద్మావతి హాజరయ్యారు.

- చెరుకూరి గార్డెన్స్‌లో ఆదివారం పద్మశాలీయ సంక్షేమ సేవాసంఘం కార్తిక వనసమారాధన వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి రాజమహేంద్రవరం సిటీ, రూరల్ నియోజకవర్గాల నుంచి సుమారు 10 వేలకు పైగా సంఘీయులు తరలి వచ్చారు. మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ అధికార ప్రతినిధి మార్గాని భరత్ రామ్, సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, పలువురు నాయకులు, నగర ప్రముఖులు విచ్చేశారు. శాశ్వత రాజగురువు ఆమంచి ఆంజనేయ గురుస్వామి, అధ్యక్షుడు బత్తుల నరసింహమూర్తి, గౌరవ అధ్యక్షుడు జొన్నాదుల రమేష్‌బాబు పాల్గొన్నారు.
- కాతేరులోని తిరుమల విద్యాసంస్థల ఆధ్వర్యంలో వన సమారాధన నిర్వహించారు. విద్యార్థులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు. విద్యాసంస్థల చైర్మన్ తిరుమలరావు మాట్లాడుతూ అందరితో కలిసి వనసమారాధన జరుపుకోవటం ఎంతో ఆనందంగా ఉందన్నారు. అకడమిక్ డైరెక్టర్ జి.సతీష్‌బాబు, ప్రిన్సిపాల్ వి.శ్రీహరి పాల్గొన్నారు.
- రాజమహేంద్రవరం మున్సిపల్ హైస్కూల్ 1985–86 పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక, కార్తిక వన సమారాధన ఘనంగా జరిగింది. పిడింగొయ్యి – కవలగొయ్యి మధ్య ఉన్న రమేష్ తోటలో నిర్వహించారు.

రాజమహేంద్రవరం సిటీ: కుల మతాలకు అతీతంగా జరుపుకొనే కార్యక్రమమే కార్తిక వన సమారాధన మహోత్సవమని రాజమహేంద్రి విద్యాసంస్థల చైర్మన్, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ టీకే విశ్వేశ్వర రెడ్డి అన్నారు. సంపత్ నగరంలోని రాజమహేంద్రి ఇంటర్నేషనల్ స్కూల్ ఆవరణలో ఆదివారం వనసమారాధన నిర్వహించారు. డాక్టర్ కర్రి రామారెడ్డి , ఓఎన్‌జీసీ విశ్రాంత అసెట్ మేనేజర్ డీఎమ్ఆర్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సీటీఆర్ఐ: కార్తిక మాసంలో సామూహికంగా భోజనం చేయడం జాతి ఐక్యతను తెలియచేస్తుందని కాంగ్రెస్ సీడబ్ల్యూసీ మెంబర్ గిడుగు రుద్రరాజు అన్నారు. నగర బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆంధ్రకేసరి కళాశాలలో ఆదివారం కార్తిక వనసమారాధన జరిగింది. నగర సంఘ అధ్యక్షుడు దుర్వాసన సత్యనారాయణ అధ్యక్షత వహించారు.


రౌతు సూర్యప్రకాశరావును సత్కరిస్తున్న తూర్పుకాపు సంక్షేమ సంఘ ప్రముఖులు


పద్మశాలీయ వన సమారాధనలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్


డాక్టర్ కర్రి రామారెడ్డిని సత్కరిస్తున్న విశ్వేశ్వరరెడ్డి



వనసమారాధనలో మాట్లాడుతున్న తిరుమల విద్యాసంస్థల చైర్మన్ తిరుమలరావు


సమ్మేళనానికి హాజరైన మున్సిపల్ హైస్కూల్ పూర్వ విద్యార్థులు


పీవీ నరసింహారావు విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తున్న రుద్రరాజు తదితరులు